# “ప్రభువా, ప్రార్థించ నేర్పుము”

## లూకా 11:1-13, పరిశీలన

ఉపదేశించడం, ప్రసంగించడం ఎలా, (visual aids) దృశ్యసాధనాలు చేసేది ఎలా, వ్రాసేది ఎలా, విషయాన్ని ఆర్గనైజ్ చేసేది ఎలా వగైరా విషయాలను చూపుమని ఆయా వ్యక్తులు నన్ను అడిగారు గాని, “డేవిడ్, ప్రార్థించడం నేర్పించు”మని ఎవరూ అడగలేదు. అయితే, క్రీస్తు యొక్క అపొస్తలులు చేసిన విన్నపాలలో అది ఒక్కటైయుంది: “ఆయన యొక చోట ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన చాలించిన తరువాత ఆయన శిష్యులలో[1] ఒకడు–ప్రభువా, యోహాను తన శిష్యులకు నేర్పినట్టుగా మాకును ప్రార్థనచేయ నేర్పుమని ఆయన నడిగెను” (లూకా 11:1).

ప్రార్థనను గూర్చి అపొస్తులులకు కొంత తెలుసు. “వారి సమాజమందిరపు విద్యలో, వారు కంఠస్థం చేసిన ప్రార్థనలు వారికి తెలుసు”[2] “రబ్బీలు చేసే ఫార్మల్, జాతీయ ప్రార్థనలు, దేవాలయంలో యాజకులు [వల్లించేవి] బిగ్గరగా, పరిసయ్యులు చేసే దీర్ఘ ప్రార్థనలు వారు బాగుగా ఎరిగినవే.”[3] ప్రభువైన యేసు యొక్క ప్రార్థనలు ఆయన ప్రార్థనా జీవితము కొంత వ్యత్యాసంగా ఉన్నట్టు వారు చూడగలిగారు. తరచుగా, “ఆయన ప్రార్థన చేయుటకు అరణ్యములోనికి వెళ్లుచుండెను” (లూకా 5:16). “ప్రార్థన చేయుటకు ఏకాంతముగా కొండయెక్కి పో”వుటను వారు చూస్తున్నారు (మత్తయి 14:23). “దేవుని ప్రార్థించుటయందు రాత్రి గడిపెను” (లూకా 6:12). ఉదయాన వారు లేవకముందే ప్రభువు ప్రార్థనకు వెళ్లుతూ ఉండేవారు. వారు ఆయనను కనుగొనినప్పుడు తప్పకుండ ఆయన ప్రార్థిస్తూ ఉంటారు. (మార్కు 18:35-37ఎ). పైగా, ప్రభువునకు ప్రార్థనలు ఏమి చేశాయో వారు చూస్తూ ఉండేవారు. ఆయన తన తండ్రితో సంబంధము పునరుజ్జీవితం చేసుకున్నాక, మోకాళ్ళ పైనుండి కొత్త బలము శక్తితో లేచేవారు. ఆయనకు కలిగింది వారికి కావాలనుకునేవారు. అందువలన, “మాకును ప్రార్థన చేయ నేర్పుమని ఆయన” నడిగారు.

ప్రభువు యొక్క జవాబు 2నుండి 13 వచనాలవరకు మన లేఖన భాగంలో ఉంది. ప్రార్థనను గూర్చిన ప్రతిదీ ఆయన తన అపొస్తులులకు చెప్పలేదుగాని, తన ప్రార్థనా జీవితాన్ని వృద్ధిచేసికోవాలని కోరిన ఎవనికైనా అవసరమైన ప్రాథమిక సత్యాలను ఆయన వారితో పంచుకున్నారు.

### ప్రార్థనా పరులైయుండుడి (2-4 వచనాలు)

సాధారణంగా “ప్రభువు ప్రార్థన” అని పిలువబడే దానినంతటిని ఆయన తిరిగి చెప్పారు:

మీరు ప్రార్థన చేయునప్పుడు – తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడును గాక,

నీ రాజ్యము వచ్చును గాక, మాకు కావలసిన అనుదినాహారము దినదినము మాకు దయచేయుము; మేము మాకచ్చియున్న ప్రతివానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము; మమ్మును శోధనలోనికి తేకుము అని పలుకుడని వారితో చెప్పెను (2-4 వచనాలు).

ఎక్కువ కచ్చితంగా చెప్పాలంటే, "శిష్యుల ప్రార్థన" లేక "మాదిరి ప్రార్థన" అని దీనికి పేరుపెట్టవచ్చు. దీర్ఘంగాను, ఎక్కువగాను తెలిసినది కొండమీద ప్రసంగంలో ఉంది (మత్తయి 6:9-15).[4] ఈ మాదిరినుండి దేవుని సమీపించే విధానాన్ని మనం నేర్చుకోవాలి.[5]

మన తండ్రిగా మనం దేవునియొద్దకు వస్తాం.[6] "తండ్రీ" అనే మాటతో ప్రార్థన ఆరంభమౌతుంది.

దైవికమైన వ్యక్తియని మనం దేవుని యొద్దకు చేరుకుంటాం: "నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక." ఆయన నామాన్ని పరిశుద్ధంగా అది ఎంచడమైయుంది. పది ఆజ్ఞలలో మూడవది: "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు" (నిర్గమ. 20:7ఎ). ప్రతి ప్రార్థనలోని తొలి అక్కర ఏమంటే దేవుని ఘనపరచి మహిమ పరచడం.

సర్వాధికారియన్నట్టు మనం దేవుని యొద్దకు వస్తాం. "నీ రాజ్యము వచ్చు గాక." తన ప్రజల యొక్క హృదయాల్లోను, జీవితాల్లోను సర్వోన్నతుని ఏలుబడియే దేవుని రాజ్యము. సంఘు/రాజ్యము స్థాపింపబడినందున, పెంతెకొస్తుకు ముందు ఆయన శిష్యులు ప్రార్థించిన భావంతో "నీ రాజ్యము వచ్చును గాక" అని మనం ప్రార్థించలేం.[7] - ప్రతి స్థలములో ఉన్నవారు దేవుని తమ జీవితాల్లో రాజుగా కిరీటం ధరింపజేయాలని నేడు మనం ప్రార్థించవచ్చు.

అవసరతలు తీర్చువాడుగా మనం దేవునియొద్దకు వస్తాం: "మాకు కావలసిన అనుదిన ఆహారము దినదినము మాకు దయచేయుము" మనం తినాలంటే పని చేయాలనుకో (2 థెస్స. 3:10). అయినా శ్రేష్ఠమైన ప్రతి ఈవికి ఆయన (దేవుడు) మూలం (యాకోబు 1:17).

న్యాయాధిపతియై యున్నట్టు మనం దేవునియొద్దకు వస్తాం. మన జీవిత గమ్యాలను ఆయన తన ఆధీనంలోనే ఉంచుకొని యున్నాడు. "మేము మాకచ్చియున్న ప్రతివానిని[8] క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము." క్రైస్తవ సంతోషాన్ని, ప్రయోజనకారిగా ఉండడాన్ని అన్నిటికంటె ఎక్కువగా రెండు సంగతులు నాశనం చేస్తాయి: "ఒకని జీవితంలో ఒప్పుకోని, క్షమాపణ పొందని పాపము; మరియు విషపూరితమైన, యితరులను క్షమించలేని మొండి తత్వం."[9]

కాపాడువాడని మనం దేవునియొద్దకు వస్తాం: "శోధనలోనికి తేక." దేవుడు ఎవనిని శోధింపడు గనుక (యాకోబు 1:13), యిక్కడ "దేవా, మమ్మును అలుముకొను లేక ఆవరించు ఏ శోధననుండైనా మమ్మును తప్పించుము" అనేది భావం (యాకోబు 1:14, 15; 1 కొరింథీ. 10:13). F. V. McFatridge యిలా అన్నాడు: పాముకాటుకు పాపక్షమాపణ విరుగుడు; ప్రార్థన [ఈ భాగం] "పాములు తిరిగే ప్రాంతం నుండి మనలను

దూరంగా ఉంచుతుంది."[10]

ఈ మాదిరి ప్రార్థన జీవితమంతటికి సంబంధించింది. అది ప్రస్తుత అవసరతను తీర్చుతుంది: "మా అనుదిన ఆహారము దినదినము దయచేయుము." గత పాపములను అది చుట్టివస్తుంది: "మా పాపములను క్షమించుము." భవిష్యత్తు శోధనలను అది కుదుర్చుతుంది: "శోధనలోనికి తేక."[11]

మాదిరి ప్రార్థనను గూర్చి యింకా చాల సంగతులు చెప్పవచ్చు. అయితే దీన్ని చదివినందువలన ఒక్క తీర్మానానికి మనం రావచ్చు: మనకందరికి ప్రార్థన అవసరం. "ఈ లోకము కలగన్న దానంతటికంటే ప్రార్థన ఎక్కువ కార్యాలను సాధిస్తుంది" అని Alfred టెన్నీసన్ అన్నాడు.[12] ప్రార్థనపై తన రచనకు రిచర్డ్ ఫాస్టర్ "హృదయపు నిజమైన గృహమును కనుగొనుట" అనే పేరు పెట్టాడు.[13] "నాకు మొఱ్ఱపెట్టుము నేను నీకు ఉత్తరమిచ్చెదను" దేవుడు యిర్మీయాతో అన్నాడు (యిర్మీయా 33:3ఎ). "మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు వేటిని అడుగుదురో అవి (దొరికెనని) నమ్మినయెడల మీరు వాటినన్నిటిని పొందుదురు" అని ప్రభువు అన్నారు (మత్తయి 21:22).

ప్రార్థనపై క్రీస్తువారి తొలిపాఠం యిలా సంక్షిప్తం చేయవచ్చు: "ప్రార్థనా పరులై యుండుడి" అనేది. మొదటిలో, అది వింతైన సలహాగా అనిపించవచ్చు. ఆచరణకు ముందు ఎక్కువ నైపుణ్యతలకు చాలా ఉపదేశం అవసరమైయుంటుంది. అయితే, ఎలా ప్రార్థించాలో నేర్చుకొనడానికి, నీవు చేయవలసిన మొదటి సంగతి ప్రార్థించడమే.[14] దేవుని యొద్దకు వెళ్లు, ప్రతి అవసరతకొరకు దేవుని యొద్దకు వెళ్లు.

> నీకు శోధనలు, బాధలు ఉన్నాయా?
> ఎక్కడైనా తొందర కలుగుతుందా?
> మనం ఎన్నడే నిరాశపడకూడదు,
> ప్రార్థనలో ప్రభువునొద్దకు దాన్ని కొనిపో.[15]

## నిలకడగా ఉండు (5-8 వచనాలు)

ప్రార్థించుటకు తన శిష్యులను ప్రోత్సహించడంలో, ప్రభువు ఒక వింతైన ఉపమానం చెప్పారు:

> మీలో ఎవనికైనను ఒక స్నేహితుడుండగా అతడు అర్ధరాత్రివేళ ఆ స్నేహితుని యొద్దకు వెళ్లి – స్నేహితుడా, నాకు మూడు రొట్టెలు బదులిమ్ము; నా స్నేహితుడు ప్రయాణము చేయుచు మార్గములో నాయొద్దకు వచ్చియున్నాడు; అతనికి పెట్టుటకు నాయొద్ద ఏమియులేదని అతనితో చెప్పినయెడల అతడు లోపలనే యుండి – నన్ను తొందరపెట్టవద్దు; తలుపు వేసియున్నది, నా చిన్నపిల్లలు నాతోకూడా పండుకొనియున్నారు, నేను లేచి ఇయ్యలేనని చెప్పునా? అతడు తన స్నేహితుడైనందున లేచి ఇయ్యకపోయినను, అతడు సిగ్గుమాలి మాటి మాటికి అడుగుటవలననైనను లేచి అతనికి కావలసినవన్నియు ఇచ్చును అని మీతో చెప్పుచున్నాను (లూకా 11:5–8).

ఆ దినాల్లో, ఆతిథ్యమనేది కేవలం సాంఘిక మర్యాద కాదు; అది ఒక దైనందిన ఆవశ్యకత, నైతిక బాధ్యతయునైయుంది. సత్రాలు బహు కొద్దిగాను బహు దూరంలోను

ఉండేవి.[16] స్నేహితుడేగాని లేక అభాగ్యతుడే గాని, ఎవ్వరూ తెలియని కొత్త స్థలానికి వచ్చినట్టయితే ఆహారము, నివాసము ఏర్పరచవలసిన బాధ్యత ఆ యింటివారికి ఉంటుంది. మన ఉపమానంలో, ఒక స్నేహితుడు అర్ధరాత్రివేళ వచ్చాడు. అతడు ఎందుకు అంత రాత్రివేళ వచ్చాడో మనకు తెలియదు. ప్రయాణంలో అతనికి ఏదైనా యిబ్బంది ఎదురయ్యిందేమో మనకు తెలియదు. పగటి ఎండదెబ్బను తప్పించుకొనడానకిగాను రాత్రి ప్రయాణం చేశాడో ఏమో.[17] కారణమేమైయున్నా, అతడు మధ్య రాత్రికి అక్కడికి చేరుకున్నాడు. అతడు చేరుకొన్న యింటివద్ద బస ఉంది అయితే భోజనం లేదు. కుండా, చట్టీ తుడిచివేయబడి ఉన్నాయి.[18]

పరిస్థితి దైన్యంగా ఉంది. ఆ సమయంలో భోజనం కొనగల ఏర్పాట్లు ఏవీ లేవు.[19] అప్పుడు ఆ యింటి యజమానుడు ఏమి చేయాలి? దగ్గరలో నా స్నేహితుడొకడున్నాడు అతని యింట ఆహారాన్ని బదులిమ్మని అడుగుతానని అతడు అనుకున్నాడు. అప్పుడు తన స్నేహితుని యింటికి వెళ్లాడు. తలుపు వేసి ఉంది, కిటికీలు సయితం మూసి ఉన్నాయి.[20] అది కూడ అతని ఆటంకపరచలేదు. తలుపు తట్టసాగాడు.[21]

నిద్రమత్తులో ఉన్న స్వరం లోపలినుండి వినిపించింది: "ఎవరక్కడ?, నీకు ఎవరు కావాలి?"

"స్నేహితుడా, నాకు మూడు రొట్టలు బదులిమ్ము. మార్గంలో నా స్నేహితుడు నా యింటికి వచ్చాడు. అతనికి పెట్టడానికి నాయొద్ద ఏమిలేదు" (5బి, 6 వ.). అతడు మూడు రొట్టెల కొరకు అడిగాడు: ఒకటి తనకు, ఒకటి అతిథికి, మూడవది – "ధారాళమునకు గురుతుగా రిజర్వ్‌లో ఉంచడానికి."[22]

విసుగుతో కూడిన జవాబు వినవచ్చింది: "– నన్ను తొందరపెట్టవద్దు; తలుపు వేసియున్నది, నా చిన్న పిల్లలు నాతోకూడ పండుకొనియున్నారు, నేను లేచి ఇయ్య లేను" ... (7 వ.). చాలామందికి ఇంటిలో ఒకే గది ఉంటుంది. రాత్రులు చాపలు పరుస్తారు. ఒక జంటకు పలువురు పిల్లలుంటారు, అప్పుడు నేలంతా పిల్లల పడకలతో ఇరుకుగా ఉంటుంది.[23] ఆ పరిస్థితిలో చీకటిలో లేచి యివ్వడమంటే ఎంత కష్టమో ఆలోచించు. (అక్కడ లైట్ స్విచ్‌లు ఉండే అవకాశముండదు)[24], చీకటిలో పండుకున్న పిల్లల మీద తొట్రుపడవచ్చు కూడ – రొట్టలు వెదకే ఆ పనిలో యిన్ని యిబ్బందు లుంటాయి "కుదరదయ్యా" అని ఆ మనిషి జవాబు యిస్తే, దాన్ని మనం అర్థం చేసికోవచ్చు!

ఏదియెలాగున్నా, "లేదు" అనే జవాబు అంగీకరించడానికి ఆ మనుష్యుడు సిద్ధపడలేదు. "అతడు తన స్నేహితుడైనందున లేచి ఇయ్యకపోయినను, అతడు సిగ్గుమాలి మాటిమాటికి అడుగుటవలనైనను లేచి అతనికి కావలసిన వన్నియు ఇచ్చును అని మీతో చెప్పు చున్నాను" అని ప్రభువన్నారు (8 వ.).

ఉత్తర ప్రత్యుత్తరాలను "ఉహించడం కష్టమేమి కాదు:

(టక్, టక్, టక్, టక్‌న కొట్టాడు)

"వెళ్లిపొమ్మని చెప్పాను! నా పిల్లలను నిద్రపుచ్చడానికి ఒక గంటసేపు పట్టింది. వారు తిరిగి లేచినట్టయితే ఈ రాత్రికి నాకు నిద్రే ఉండదు!"

"అయితే నాకు రొట్టె కావాలి!"

"లేదు!"

(టక్, టక్, టక్)

"దాన్ని ఆపివేయ్! నీవు అలా కొనసాగితే, నా భార్యను కూడ నీవు నిద్రలేపిన వాడవౌతావ్. నీవు అలా చేసినట్టయితే, మేమిద్దరం ట్రబుల్ పడతాం. నా భార్య సంతోషంగా ఉండనప్పుడు, ఎవ్వరూ సంతోషంగా ఉండకుదరదు!"[25]

"అయితే, నాకు రొట్టె కావాలి!"

"లేదు!"

(టక్, టక్, టక్)

"ఓకే, ఓకే, ఓకే. ఇప్పుడు నీవు ఒకరిని లేపనేలేపావు. భయంకరంగా తట్టే నీ తట్టుడును ఆపు. నేను ఏమి కనుగొనగలనో చూస్తాను!"

ఈ పదం "పట్టువీడని" అని NASBలో తర్జుమా చేయబడింది. తెలుగులో "సిగ్గుమాలి" అని ఉంది. అక్షరార్థంగా గ్రీకులో అదే భావం. నిజమే, మాటి మాటికి అడుగుటలో అతడు సిగ్గుమాలియే ఆ పని జరిగించాడు. తలుపు తట్టడానికి అతడు కొనసాగించడం వలన ఆ యిరుగు పొరుగు వారందరు లేచి ఉంటారు. దీపాలు వెలిగించి ఉంటారు. కుక్కలు మొరుగుతుండవచ్చు. కోపంవచ్చినవాళ్ళు నిశ్శబ్దంగా ఉండమని కేకలువేసియుండవచ్చు. అతని ముఖం ఎర్రబారియుండవచ్చు. ఏదియేమైనా, రొట్టెలు పొందేవరకు అతడు నిలకడగా ఉన్నాడు.

మనం అడిగే దానిని పొందునట్లు దేవుడు బలవంతపెట్టవలసిన స్నేహితుని వంటివాడని ఈ ఉపమానము బోధిస్తుందా? కాదనుకో 13వ వచనం చూడు. ప్రార్థనపై ప్రభువు బోధించే కార్యక్రమంలో చివరి ఉదాహరణను ఆయన ఉపయోగించారు: "మీరు చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించుననెను." ఈ ఉపమానంలోని సందేశాన్ని ఈ విధంగా చెప్పవచ్చు: "పదేపదే చేసిన నీ విన్నపానికి నీ స్నేహితునికీ బదులివ్వక తప్పదంటే పరలోకమునందున్న నీ తండ్రి, నిన్ను ఎల్లప్పుడూ ఆశీర్వదించుటకు సిద్ధపడినవాడు, నీవు పట్టుబడితే ఎందుకు అంగీకరించడు!" తదుపరి ఇదే అంశంతో ప్రభువు మరొక కథను ఈ వాక్యాలతో ఆరంభించి చెప్తున్నాడు. "ఎప్పుడు మనసును జారిపోనీక ప్రార్థనను విడువక చేయ వలెను" (లూకా 18:1). ఈ నీతి కథ ప్రయోజనం, దేవుని విముఖతను జయించడం కాదు. దేవుని అనుగ్రహాన్ని ఎలా చేపట్టాలో ఇది చెప్తుంది.[26]

విన్నపముల విషయంలో మనం పట్టుదలగలవారమై ఉండవలసినట్టు దేవుడు తెలిసికొనగోరుతున్నాడు. ఇష్ట పూర్వకము గాని ప్రార్థనలకు ఆయన బదులివ్వరు. అనేక ప్రార్థనలు తేలికగా ఉచ్చరించి త్వరగా మరువబడతాయి.[27] మన ప్రార్థనలు దేవునిపై ప్రభావం చూపకముందు, అవి మనమీద ప్రభావాన్ని కనుపరచాలి. అవి మన హృదయములోనుండి రావాలి!

## ఓర్పు కలిగియుండు (లూకా 11:9, 10)

తరువాత పలికిన ప్రభువు మాటల్లో పట్టుదల మీద సందేశం కొనసాగింది: "అటువలె మీరును అడుగుడి, మీ కియ్యబడును, వెదకుడి, మీకు దొరకును; తట్టుడి, మీకు తీయబడును. అడుగు ప్రతివాని కియ్యబడును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడునని మీతో చెప్పుచున్నాను" (9, 10 వచనాలు). ఉపమానంతో యిది సహజంగా ముడివేయబడింది: సంకటంలో చిక్కుకున్న వ్యక్తి తన స్నేహితుని భోజనం కొరకు, మరియొక స్నేహితుని తలుపు తట్టి, అవసరమైన భోజన పదార్థములకొరకు వెదకుతున్నాడు.

మనకు కావలసిన వాటికొరకు మనం దేవుని అడగాలనే పాఠాన్ని మనం దీనినుండి లాగవచ్చు. గత పాఠంలో మనం గమనించినట్టు, "అడుగుడి" "వెదకుడి" "తట్టుడి" అనేదానిలోనుండి – "అడుగుడి" అనే పదం వస్తుంది.[28] "దేవుని అడుగనందున మీ కేమియు దొరుకుట లేదు" అని యాకోబు వ్రాశాడు (4:2బి).

మన విన్నపములయందు పట్టుదల కలిగియుండాలని కూడ ఈ వచనాలు నొక్కి చెప్పుతున్నాయి. "అడుగుడి, వెదకుడి, తట్టుడి – అని తర్జుమా చేసిన గ్రీకు పదాలు వర్తమాన కాలంలో ఉన్నాయి – అంటే, కార్యాన్ని కొనసాగించే దాన్ని సూచిస్తున్నాయి. 9వ వచనానికి అక్షరార్థం అడుగుతునే ఉండు. నీవు కనుగొంటావు. అది నీకు యివ్వబడుతుంది. వెదకుతునే ఉండు, నీవు కనుగొంటావు; తట్టుతునే ఉండు, అది నీకు తెరువ బడుతుంది." సొదొమా గొమొర్రాల కొరకు ప్రార్థించుటలో నిలకడగా ఉన్న అబ్రాహామును గూర్చి ఆలోచించూ (ఆది. 18:22-32). శరీరములోని ముల్లు కొరకు ప్రార్థించిన పౌలును గూర్చి ఆలోచించు (2 కొరింథీ. 12:8). చెమట నేలను పడుచున్న గొప్ప రక్త బిందువులవలె కారునంత ఆతురముగా ప్రార్థించిన క్రీస్తు ప్రభువును గూర్చి ఆలోచించు (లూకా 22:44). వారి ప్రార్థనలకు బదులు వచ్చేవరకు ఆ ముగ్గురు పట్టుదలతో ఉన్నారు.[29]

పట్టుదలను మాత్రమే కాక, అందులోని తీవ్రతను క్రియారూపం తెలుపుతుంది. వెదకుట, అడుగుటకంటె అధికమైనది. తట్టుటలో వెదకుట కంటె అధికమైనది యిమిడి ఉంది. మన ప్రార్థనలు మనఃపూర్వకముగా ఉండాలి. "నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును" (యాకోబు 5:16).[30]

మనం ఎందుకు ప్రార్థించాలి? ప్రార్థనలో మనం ఎందుకు పట్టుదలగా ఉండాలి? ప్రార్థనలో మనం ఎందుకు నిలకడగా ఉండాలి? ఎందుకంటె, దేవుడు ప్రార్థనలకు బదులిస్తాడు. మన లేఖన భాగంలోని ప్రతి కార్యామునకు తగిన బదులు యివ్వ బడుతుంది: అడిగినవాడు పొందాడు, వెదకినవానికి దొరికింది, తట్టినవానికి తలుపు తెరుచుకుంది. ఈ సత్యము పట్టుదలకి స్నేహితుని చర్యలో ఉదాహరణగా నిలిచింది. అడుగుతూ, వెదకుతూ, తట్టుతూ ఉన్న ఆ మనిషికి అవసరమైన మూడు రొట్టెలు లభించాయి.

"దేవుడు తన పిల్లలు అడిగిన ప్రతి దానికి ఔనని బదులిస్తాడని దీని అర్థమా?" కాదు, క్రీస్తు కష్టాలు అను "పాత్ర" తొలగి పోవాలని కోరాడు. కాని అది తొలగిపోలేదు

(మత్తయి 26:39), తన "ముల్లు" బాధను తొలగించుమని పౌలు ప్రార్థించాడు (2 కొరింథీ. 12:7, 8), కాని అది తొలగలేదు. మన లేఖనంలోని తరువాత భాగం (లూకా 11:11–13) దేవుని భూలోకపు తండ్రితో పోల్చుతుంది. తండ్రులుగా ఉన్న మనం మన పిల్లల మనవులకు ఎల్లప్పుడు "అవును" అనే చెప్తూతూ ఉంటామా?[31] కొన్ని సార్లు మన జవాబు ''లేదు'' అనిగాని లేక ''కొంచెం ఆగు'' అనిగాని అయ్యుంటుంది.[32] "లేదు" కాని దాని కంటె యిది శ్రేష్ఠమయ్యిందని అంటూ ఉంటాం. ఏది యెలాగున్నా, మనం మన పిల్లలను ప్రేమించినట్టయితే, వారి విన్నపాలకు బదులిస్తాం. 8 నుండి 10 వరకు ఈ విషయం తెలియజేయబడింది: పట్టువీడక మనం ప్రార్థించుతూ ఓర్పుగలిగి యున్నట్టయితే, దేవుడు మన ప్రార్థనలను ఆలకిస్తాడు.

## సద్భావన కలిగియుండు (లూకా 11:11-13)

మన ప్రార్థనల విషయంలో మనం సద్భావన కలిగియుండాలి. ఈ వాస్తవం క్రీస్తు ప్రభువు ముగింపు మాటల్లో తిరిగి చెప్పబడింది:

> మీలో తండ్రియైనవాడు తన కుమారుడు చేపనడిగితే చేపకు ప్రతిగా పాము నిచ్చునా? గుడ్డునడిగితే తేలునిచ్చునా? కాబట్టి మీరు చెడ్డవారైయుండియు,[33] మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించును (11–13 వచనాలు).

***మొదటి దృశ్యం:*** ఒక బాలుడు తన తండ్రియొద్దకు వచ్చి – చేపను అడుగుతాడు. అది వేపిన చేపముక్కయై యుండవచ్చు.[34] "సరే" నని వాని తండ్రి ఒక చిరునగవుతో చెప్తూతున్నాడు. బిడ్డ తన చెయ్యి చాపాడు. అప్పుడు ఆడుతున్న చిన్న పామును తండ్రి వాని చేతిలో వేశాడు! అది షాకింగ్‌గా ఉంటుంది కదా?

***దృశ్యం రెండు:*** కుమారుడు తన తండ్రిని ఒక గుడ్డు యిమ్మని అడుగుతాడు. అది ఉడికించిన గుడ్డయి యుండవచ్చు. దానిని వాడు తీసికొనిపోయి ఎక్కడైనా తినవచ్చు – ఆకలిగొనినప్పుడు. "దాన్ని నీకు యివ్వడం నాకు యిష్టమేనంటూ తండ్రి బుట్టను దగ్గరకు" తెచ్చాడు. "ఇందులో చెయ్యిపెట్టి తీసికో" అని తన బిడ్డతో చెప్పాడు. ఆ పిల్లవాడు తన చేతిని బుట్టలో పెట్టినప్పుడు అందులో ఏ గుడ్డు కన్పించలేదు సరిగదా – తోక ఎత్తి కుట్టడానికి సిద్ధంగా ఉన్న తేలు అక్కడుంది![35] ఎంత భయంకరం!

తమ బిడ్డలను ప్రేమించే తండ్రులు ఈలాటి ట్రిక్కులు చేయరు. మన పరలోకపు తండ్రియు మనయెడల ఆలాగు చేయరు. "మీరు చెడ్డవారైయుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్యనెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించుననెను" (12, 13 వచనాలు). ముందుగా, ప్రభువు యిదే పోలికను ఉపయోగించినప్పుడు, "... పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగు వారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులను నిచ్చును" అని తెలిపారు (మత్తయి 7:11బి). ఇప్పుడు, కొన్ని మాసాలు గడిచిపోయిన తరువాత, దేవుని దీవెనలలో ఒకదానిని ఆయన ప్రత్యేకించి ప్రతిపాదించారు: అది

పరిశుద్ధాత్మ అను వరము, ఆయన నామములోనికి బాప్తిస్మం పొందిన వారికందరికి ప్రసాదింపబడేది (అపో. 2:38). లియోన్ మోరిస్ యిలా వ్రాశాడు,

> పరిశుద్ధాత్మ అను వరము మన అత్యున్నతమైన మేలుగా లూకా ... చూస్తాడు. దీనిని "చారిస్‌మేటిక్" వరములనే విధానంలో మనము అర్థంచేసికోనవసరం లేదు. రోమా 8లో వలె, ఆత్మయొక్క పని సాధారణంగా క్రైస్తవ జీవితములో జరిగే దానిని సూచిస్తుంది.[36]

ముందుగా మనం గమనించినట్టే, మన ప్రతి విన్నపానికి "అవును" అనే బదులు దేవుడు యివ్వడు. కాని ఆయన తన పిల్లల ప్రతి ప్రార్థనకు బదులిస్తాడు. ఆయన అలా చేసినప్పుడు "మేలైనదేదో అదే ఆయన చేస్తాడు". దీర్ఘ కాల పరిథిలో మనకు ఏది మేలో దానిని ఆయన చేస్తాడు. ఆయన జవాబు మేలైనదిగా మనం ఆ సమయంలో చూడం; కాని, చివరిలో, "దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము ప్రకారము పిలువబడినవారికి మేలుకలుగుటకై సమస్తమును సమకూరుస్తాడు" (రోమా. 8:28). మనం ప్రార్థించేటప్పుడు సద్భావన కలిగి ఉండడానికి ఎన్నో కారణాలున్నాయి!

## ముగింపు

ఎలా ప్రార్థించాలో నేర్చుకొనడం శిష్యులకు ప్రాముఖ్యం. వారికి ముందున్నది గెత్సేమనే, ప్రభువు పడిన బాధలు వలన, ఆయనను కొరడాలతో కొట్టడం, రక్త దాహముతోనున్న మూక అరుపులు, సిలువ కఠోర బాధ, సమాధి అంధకారపు నిశ్శబ్దము నిలిచియుంది.[37] నేడు మనము కూడా శోధనలు కష్టములు ఎదుర్కొంటాం. ప్రార్థించడం ఎలాగో మనం కూడా నేర్చుకోవాలి. ప్రార్థనను గూర్చి మనం ఎంతో నేర్చుకొనవలసింది. అయితే లూకా 11:1-13లోని సత్యాలు ఆరంభించడానికి సరిపోతాయి.

- ప్రార్థనా పరుడవైయుండు: చేయడం వలన నేర్చుకుంటావ్.
- నిలకడగా ఉండు: వెంటాడుట వలన విజయం సాధిస్తావు.
- ఓపిక (ఓర్పు) కలిగియుండు: అడుగుటవలన పొందుతావు.
- సద్భావన కలిగియుండు: ప్రార్థంచడంవలన దీవించబడతావ్.

దేవుని "తండ్రీ" అని నిజముగా పిలువకుండ, ముఖ్యమైన ప్రార్థనా జీవితాన్ని నీవు ప్రారంభించ లేవని గ్రహించాలి (లూకా 11:2). నీవు దేవుని బిడ్డవా? (గలతీ. 3:26, 27). "నీటిమూలముగాను ఆత్మమూలముగాను నీవు జన్మించావా?" (యోహాను 3:5; 1 పేతురు 1:23; అపో. 2:38)? ఇంతకు ముందే నీవు దేవునిబిడ్డవైతే, నీవు నీ తండ్రితో సన్నిహితంగా నిలిచియున్నావా? నీకును నీ దేవునికిని మధ్య నిలిచే ఒకే ఒక్కటి పాపం (యెషయా 59:1, 2). నీ పాపాలు కడిగివేసికొనడానికి నీవు బాప్తిస్మము పొందవలసి వస్తే (అపో. 22:16), లేక నీవు త్రోవ తప్పిన క్రైస్తవుడవైయుండి ప్రభువు నొద్దకు నీవు తిరిగిరావలసిన అవసరం ఉంటే (గలతీ. 6:1; అపో. 8:22; యాకోబు

5:16), మానివేయకు, నేడే దానిని చేయుము.

## నోట్సు

లూకా 11:1–13ను “ప్రాథమిక ప్రార్థన” అని పిలిచాడు F. V. McFatridge.[38] “నీ ప్రార్థనా జీవితంలో సుభారంభమేమి?” అనేది మరోపేరు. “శక్తివంతమైన ప్రార్థన రహస్యము” అని కూడ దీన్ని పిలువవచ్చు, ప్రార్థనలో మర్మమైయున్న రహస్యాలేవీలేవు. మనకు ఏమి తెలుసో దానిని చేయడానికి ఆరంభించాలి.

---

సూచనలు

[1]విన్నపం ఒక శిష్యుని కడనుండియే వచ్చింది. “మాకు నేర్పుము” అని అతడు అడిగినందున, మిగిలిన శిష్యుల పక్షంగా కూడ అతడు మాట్లాడు తున్నాడనిపిస్తుంది. [2]John T. Carroll and James R. Carroll, *Preaching the Hard Sayings of Jesus* (Peabody, Mass.: Hendrickson Publishers, 1996), 120. [3]F. V. McFatridge, *Lord Teach Us to Pray* (Nashville: Broadman Press, 1956),1. [4]వారు క్రీస్తు ప్రభువు ప్రార్థనా జీవితాన్ని చూస్తున్నప్పుడు, ప్రార్థనకు సంబంధించి ఏవైనా రహస్యాలున్నాయని వారు భావించారేమో. [5]“క్రీస్తు జీవితం, 7”లో “మాదిరి ప్రార్థన” అనే ప్రసంగంలో వివరాలు చూడు. [6]రోమా 8:15; గలతీ. 4:6; 1 పేతురు 1:17లను చూడు. [7]ఆ దినాల్లో ప్రధానమైన అక్కర మెస్సీయా రాజ్యం స్థాపించబడడమే. క్రీస్తు మరణం, సమాధి, పునరుత్థానాల తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన అది స్థాపింపబడింది (మార్కు 9:1; అపో. 1:8; అపో. 2:1–4). [8]ఆ ఋణము డబ్బు ఋణం కాదు – అది పాప ఋణం. మనకు విరోధంగా పాపము చేసిన ప్రతివారికి అది వర్తిస్తుంది. [9]McFatridge, 40. [10]Ibid., 47.

[11]William Barclay *The Gospel of the Luke*, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 144. [12]Alfred, Lord Tennyson, “Morte D'Arthur,” *Great Poems of the English Language*, comp. Wallace Alvin Briggs (New York: Tudor, 1933), 795. [13]Richard Foster, *Prayer: Finding the Heart's True Home* (San Francisco: Harper, 1992), quoted in Carroll and Carroll, 122, 127. [14]“మొదట చేయుము” అనే దానిని ఉపయోగించు. [15]Joseph M. Scriven, “What a Friend We Have in Jesus,” *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [16]బాడుగ గదులు మంచివి కానందున ఒకడు తన స్నేహితుని అక్కడికి పంపుటకు యిష్టపడడు. [17]నా మాటల్లో కొంత హాస్యాన్ని జోడించి “ట్రాఫిక్ చాల ఘోరంగా ఉంది. వాడి టైర్ ఫ్లాట్ అయిందేమో” అని అనవచ్చు. [18]ఒకవేళ శ్రోతలు ఈ నర్సరీరైమ్స్‌ను ఎరిగివుంటే “లైక్ మదర్ హాబ్బర్స్ కప్‌బోర్డ్ హాజ్ వాజ్ బేర్” అనే పాటను చెప్పు. [19]మీ ప్రాంతంలో రాత్రులందు కూడ వ్యాపారం చేయగలవాటి పేర్లను తెలుపవచ్చు. [20]పగటిపూట తలుపులు కిటికీలు తెరచి ఉంటాయి. రాత్రి మూసి ఉంటాయి, మూసిన తలుపులు కిటీకీలు ఉంటే, మా జోలికి రావద్దనడమే.

[21]ఉపమానంలో తట్టడం ప్రస్తావించబడలేదు. వర్తింపులో అది ఉంది (లూకా 11:9, 10). నిద్రించుతున్నవారి దృష్టిని పొందడానికి తట్టడం సహజం. [22]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or a Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914.), 480. [23]చలిగా ఉన్నా వాతావరణంలో, జంతువులను కూడా యిండ్లలోనే ఉంచుకుంటారు గనుక, జనరల్ కన్‌ఫ్యూజన్ ఎక్కువౌతుందని కొందరు రచయితలన్నారు. [24]“వెలిగి ఆరిపోతు, వెలిగి ఆరిపోతు ఉన్న దీపంపై చప్పట్లు అవసరం లేదు” అని హాస్యంగా చెప్పు. [25]Bob Lyons అనే నా స్నేహితుని నుండి ఈ ప్రతిపాదనను సేకరించడం జరిగింది. [26]Chris Bullard, “How to Be an Intercessor,” sermon preached at the Overland Park church of Christ, Overland Park, Kansas, 13 May 1985. [27]“నేను యిప్పుడు నిద్రించు ప్రార్థనకు” అనే పిల్లల కంఠస్థం చేసిన ప్రార్థనను సూచిస్తు చెప్పవచ్చు. [28]“క్రీస్తు జీవితం, 2ను” చూడు. [29]నీవు ప్రార్థించేటప్పుడు, ఎన్నడే, ఎన్నడే, ఎక్కడే ఎన్నడే విడువకు. అని Winston Churchill అన్నాడట. [30]“మనఃపూర్వకమైన” అనేది కొన్ని తర్జుమాల్లో కనిపించదు.

[31]మీ శ్రోతలకు సంబంధించిన ఉదాహరణను ఉపయోగించు. [32]ప్రార్థనలకు జవాబిచ్చే దేవుని మార్గమును గూర్చి చర్చించుటకు సమయము లేదు. "కొద్ది సేపు ఆగు" అనే జవాబుకు "దేవుని ఆలస్యమునకు దేవుడు తిరస్కరించాడని అర్థంకాదు" అని ఎవరో ఒకరు అన్నారు. [33]ప్రతివాడు తన సొంత పాపంవలన దోషియైయ్యాడు (రోమ 3:23; 6:23). [34]ఇలాంటి చేపనే 5000 మందికి ఆహారం పెట్టడంలో యేసు ఉపయోగించారు. ("క్రీస్తు జీవితం, 3ను" కూడ చూడు). [35]తేళ్ళను గూర్చి "ప్రకటన, 5" ట్రూత్ ఫర్ టుడే ఆంగ్ల సంచికలో చూడు. [36]Leon Morris, *Luke*, rev. ed., Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 214-15. "అద్భుతకరము కాని పరిశుద్ధాత్మ వరములు," "పరిశుద్ధాత్మ క్రైస్తవునికేమి చేస్తారు?" "కార్య గ్రంథం, భాగం 3ను" చూడు. [37]McFatridge, 3. [38]McFatridge, 5.